క్లుప్తంగా

ఆలయానికి వీల్ చైర్ వితరణ



చిల్లకూరు : తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మను దర్శించుకునేందుకు వచ్చే దివ్యాంగ భక్తుల సౌకర్యార్థం వీల్ చైర్‌ను కోటకు చెందిన సారంగం సాయివంశీ దత్ జ్ఞాపకార్థం సారంగం సునీత అందజేశారు. ఆమె ఆదివారం ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వీల్ చైర్‌ను ఈవో నవీన్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో కోటకు చెందిన నాయకులు చిల్లకూరు దశరథరామిరెడ్డి, సారంగం రమేష్ బాబు, ఆలయ సిబ్బంది సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం



చిల్లకూరు : మండలంలో నాలుగు రోజుల క్రితం కురిసిన అకాల వర్షానికి ఓడూరు పంచాయతీ పున్నపువారిపాళెంకు చెందిన సూళ్లూరు వెంకట్రామ్ అనే దివ్యాంగుడి ఇంటిపై చెట్టు పడింది. ఇల్లు దెబ్బతినింది. ఇంటిలోని సామగ్రి ధ్వంసమై వారు నిరాశ్రయులయ్యారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి జమీర్ బాషా రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు అధినేత శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఆయన ఆదివారం గ్రామానికి చేరుకుని వెంకట్రామ్ కుటుంబాన్ని పరామర్శించి ఇంటి నిర్మాణానికి రూ.20 వేలు అందజేశారు. భవిష్యత్తులో ఏదైనా అవసరమైతే సంప్రదించాలని సూచించారు.

విద్యా సామగ్రి పంపిణీ



కుక్కపల్లివారికండ్రిగ పాఠశాలలో విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేత

దొరవారిసత్రం : మండలంలోని కుక్కపల్లివారి కండ్రిగ, వేలికాడు, మీజూరు, బేరిజంగాపల్లి, తొగరాముడి, శ్రీధనమల్లి, చందనముడి గ్రామాల్లోని ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని జైభీమ్ ట్రస్ట్ నిర్వాహకులు విద్యాసామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ సంధ్యాదేవి, సభ్యులు సిద్దార్థ, గౌతమ్, హెచ్ఎంలు శ్రీనివాసులు, పాఠశాల చైర్మన్ శ్రీజ పాల్గొన్నారు.

మల్లాంలో ప్రత్యేక పూజలు

చిట్టమూరు : మల్లాం గ్రామంలో వున్న వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల శాంతి కల్యాణాన్ని కనుల పండువగా చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. కుజదోషం ఉన్న వారు హోమం చేయించుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

పైలా వాసుదేవరావుకు నివాళి

సైదాపురం: సైదాపురంలోని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ జిల్లా కార్యాలయంలో ఆదివారం కామ్రేడ్ పైలా వాసుదేవరావు వర్ధంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి డీపీ పోలయ్య మాట్లాడుతూ పీడిత ప్రజల కోసం తన కలాన్ని, గళాన్ని వినిపించిన మహనీయుడు పైలా వాసుదేవరావు అని కొనియాడారు. కార్యక్రమంలో రమేష్, నాగమణి, హరిబాబు, పెంచలయ్య, కోటయ్య, శ్రీను పాల్గొన్నారు.

చోరీ కేసులో విచారణ

కోట : చోరీ కేసుకు సంబంధించి పోలీసులు ఆదివారం ఎన్‌సీఆర్ నగర్‌లో విచారణ చేపట్టారు. ఎస్ఐ పవన్‌కుమార్ కథనం మేరకు.. ఎన్‌సీఆర్ నగర్‌కు చెందిన శోలా ప్రమీలా డయాబెటిస్‌తో బాధపడుతోంది. నెల్లూరులోని ప్రైవేట్ ఆస్పత్రి ల్యాబ్‌లో పనిచేస్తున్న సంపత్ ఆమె ఇంటికి వచ్చి టెస్ట్ చేసి వెళుతున్నాడు. ఈ నెల 10న సంపత్ ఆమెకు మత్తు మందు ఇచ్చి రెండు జతల బంగారు గాజులు తీసుకుని ఉడాయించాడు. ఆమె ఫిర్యాదు మేరకు సంపత్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని కుమ్మరిగుట శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో ఆదివారం సుశీల నేత్రాలయ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని వైద్యులు పి.సుధాకర్ తెలిపారు. సుమారు 255 మంది రోగులు కంటి పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. 108 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్టు వెల్లడించారు. వారిని వైద్యశాల వాహనంలో నెల్లూరుకు తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్ చేస్తామని తెలిపారు. వైద్యులు అపర్ణ, విశ్రాంత తహసీల్దార్ ఎల్ మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

పిల్లర్లకే పరిమితం

మండలంలోని మల్లాంలో పీహెచ్‌సీ భవన నిర్మాణం పిల్లర్లకే పరిమితమైంది. గత ప్రభుత్వం ప్రభుత్వ వైద్యశాల భవన నిర్మాణం కోసం టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్ పాత భవనం కూల్చివేసి కొత్త భవనం నిర్మాణానికి పునాదులు వేసి పిల్లర్లు వేశారు. ఏమైందో కాని పనులు ఆపేశాడు. రెండేళ్లుగా పీహెచ్‌లో భవనం లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. –చిట్టమూరు



కన్నీటి కష్టాలు



మండలంలోని చిల్లకూరు అరుంధతి కాలనీలో పది నెలలుగా తాగునీరు సరఫరా కావడం లేదు. గ్రామంలో మూడు ఓవర్‌హెడ్ ట్యాంకులు ఉన్నాయి. విద్యుత్ మోటార్లు మరమ్మతులకు గురికావడంతో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. జీలపాటూరుకు వెళ్లి వాటర్ క్యాన్లు కొని తెచ్చుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు. –పెళ్లకూరు

కదలని మురుగు

మండల కేంద్రమైన వాకాడు దళితవాడలో 4 నెలలుగా మురుగు కాలువల్లో మురుగు ముందుకు కదలడం లేదు. దీంతో దోమలు వృద్ధి చెంది జ్వరాలు ప్రబలుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. రాత్రిళ్లు దుర్గంధం వెదజల్లడంతోపాటు దోమలతో కంటిమీద కునుకు లేకుండా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. –వాకాడు



వేడుకగా సీతారామ కల్యాణం



ఓజిలి : సీతారాముల గ్రామోత్సవం



నాయుడుపేట టౌన్ : ర్యాలీ చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

చిల్లకూరు : మండలంలోని బల్లవోలులో సీతారాముల ఆలయంలో జరుగుతున్న శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా ఆదివారం సీతారాముల కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తగా గ్రామానికి చెందిన దువ్వూరు కిరణ్‌కుమార్‌రెడ్డి దంపతులు వ్యవహరించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన డాక్టర్ మారంరెడ్డి రఘురామిరెడ్డి, అమరనాథ్ రెడ్డి, సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంతోత్సవ ర్యాలీ

నాయుడుపేట టౌన్ : శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వసంతోత్సవ ర్యాలీని ఆర్యవైశ్య సంఘ నాయకుల సారధ్యంలో ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శనివారం రాత్రి స్వామి అమ్మవారి కల్యాణం చేశారు. ఆదివారం ఉదయం స్వామి, అమ్మవార్లను చిత్రపటాలను ప్రత్యేకంగా అలంకరించి రథంపై కొలువుదీర్చి పట్టణంలో ఊరేగించారు. కార్యాక్రమంలో ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు పెనల



చిల్లకూరు : సీతారాముల కల్యాణం చేస్తున్న ఉభయకర్తలు కిరణ్‌రెడ్డి దంపతులు

జయరాజ గోపాల్, తిరుపతి, నెల్లూరు జిల్లాల రూరల్ అధ్యక్షులు గూడూరు కిషోర్ కుమార్, కనమర్లపూడి సురేష్, నాయకులు కోటా వెంకటేశ్వర్లు, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మెంటా మల్లికారున తదితరులు పాల్గొన్నారు.

సీతారాములుకు ప్రత్యేక పూజలు

ఓజిలి: మండలంలోని చిలమానుచేనులోని సీతారాముల ఆలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించి గ్రామోత్సం చేశారు. ఉదయం వసంతోత్సవం, ఉట్టి కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. గ్రామ పెద్దలు యల్లంరాజు మధుశేఖర్‌రాజు, యల్లంరాజు రామ్‌ప్రసాద్‌రాజు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఏడాదికే కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత



నాయకులతో మాట్లాడుతున్న నేదురుమల్లి

వాకాడు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంపై ఏడాదికే తీవ్రమైన ప్రజా వ్యతిరేకత వచ్చిందని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఆయన ఆదివారం వాకాడులోని తన నివాసంలో కోట, వాకాడు, చిట్టమూరు మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పతనానికి కౌంట్ డౌన్ మొదలైందన్నారు. ఇటీవల వెంకటగిరిలో జరిగిన అవిశ్వాసంలో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడమే ఇందుకు నిదర్శనమన్నారు. 2027లో జరిగే జమిలి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందని, జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. నాయకులు, కార్యకర్తలకు మంచి రోజులు వస్తున్నాయని, ధైర్యంగా ఉండాలని సూచించారు. ఎన్ని కష్టాలు వచ్చినా వైఎస్సార్‌సీపీని వీడేదిలేదని, భవిష్యత్‌లో రామన్న వెంటే నడుస్తామని నాయకులు, కార్యకర్తలు స్పష్టం చేశారు.

నేడు వెంకటగిరికి నేదురుమల్లి రాక

వెంకటగిరి(సైదాపురం) : వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సోమవారం వెంకటగిరికి వస్తున్నారని ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఉదయం 8.30 గంటల నుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నాయి.

నేడు శ్రీవారికి చందనాలంకరణ

రాపూరు: మండలంలోని పెంలచకోలనలో పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి మూలమూర్తికి సోమవారం చందనాలంకరణ చేయనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. స్వామి వారి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా సోమవారం ఉదయం 4 గంటలకు ప్రత్యేక అభిషేకాలు, 9 గంటలకు శాంతి హోమం, 10 గంటలకు కల్యాణం, రాత్రి 7 గంటలకు గరుడ సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు నెల్లూరులో ముస్లింల శాంతియుత ర్యాలీ

గూడూరు రూరల్/నాయుడుపేట టౌన్ : వక్ఫ్ బోర్డుకు సంబంధించిన బిల్లును ఉపసంహరించుకోవాలని కోరుతూ నెల్లూరు కోటమిట్టలోని షాదీ మంజిల్ వద్ద సోమవారం ముస్లింల శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మగ్దూమ్ మొహిద్దీన్, నాయుడుపేటకు చెందిన మసీదుల మౌలానాలు కోరారు. వారు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డును నిర్వీర్యం చేసేలా బిల్లును ప్రవేశపెట్టడం దారుణమన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ సోమవారం నెల్లూరులోని కోటమిట్ట షాదీ మంజిల్ నుంచి ర్యాలీగా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం అందజేయనున్నట్టు తెలిపారు. ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

మే 3న ఉచిత ఖత్నాలు

గూడూరు రూరల్ : మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో మే 3న ఉచిత ఖత్నాలు నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. వారు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గూడూరు పట్టణంలోని షాదీ మంజిల్‌లో మే 3న ముస్లిం పిల్లలకు ఉచితంగా ఖత్నాలు చేయిస్తున్నామని తెలిపారు. ఖత్నా చేయించుకున్న పిల్లలకు పౌష్టికాహారం, మందులను పట్టణంలోని లలితా మందుల షాపు యాజమానులు అందజేస్తారని వెల్లడించారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్షలు



నాయుడుపేట బాలుర గురుకులం వద్ద ప్రవేశ పరీక్షలకు హాజరైన విద్యార్థులు



విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న పుదూరు బాలికల గురుకులం ప్రిన్సిపాల్

నాయుడుపేట టౌన్ : నాయుడుపేటలోని అంబేడ్కర్ బాలుర, బాలికల గురుకుల పాఠశాలల్లో ప్రవేశం కోసం ఆదివారం అర్హత పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. మొత్తం 610 మంది విద్యార్థులు హాజరైనట్టు ప్రిన్సిపాళ్లు దాదాఫీర్, రూత్ రమోలా తెలిపారు. 5వ తరగతిలోకి ప్రవేశానికి ఉదయం, ఇంటర్‌లో ప్రవేశానికి మధ్యాహ్నం రెండు విడతల్లో పరీక్షలు నిర్వహించారు. పట్టణంలోని బాలుర గురుకులంలో 5వ తరగతికి 141 మంది దరఖాస్తు చేసుకోగా 16 మంది గైర్హాజరైనట్టు తెలిపారు. ఇంటర్‌కు 170 మంది దరఖాస్తు చేసుకోగా 35 మంది హాజరుకాలేదని వెల్లడించారు. పుదూరు బాలికల గురుకులంలో 5వ తరగతిలో ప్రవేశానికి 167 మంది దరఖాస్తు చేసుకోగా 9 మంది, ఇంటర్‌కు 132 దరఖాస్తు చేసుకోగా 11 మంది గైర్హాజరైనట్టు తెలిపారు. పుదూరు బాలికల గురుకులంలో విద్యార్థులకు పట్టణానికి చెందిన కంకిపాటి కిరణ్, చెన్నగిరి శ్రీనివాసులు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

గజవాహనంపై సంగమేశ్వరుడు

కోట: గూడలి సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం మహాన్యాస రుద్రాభిషేకం, రుద్ర హోమం, లఘు పూర్ణాహుతి, కుంకుమార్చన చేశారు. కామాక్షీదేవి, సంగమేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించిన గజ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటలకు స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించేందుకు దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.

జగనన్న సైనికుడిగా పనిచేస్తా



పాదర్తి రాధాక్రిష్టారెడ్డి

కోట: జగనన్న సైనికుడిలా వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాదర్తి రాధాక్రిష్టారెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం విద్యానగర్‌లో విలేకరులతో మాట్లాడారు. తనకు బాధ్యతలు అప్పగించిన జగనన్నకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు పార్టీ అప్పగించిన బాధ్యతను నెరవేరుస్తానన్నారు. తనకు పదవి రావడంలో కృషి చేసిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఒలింపియాడ్‌లో ప్రగతి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కిషోర్

కోట: గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన ఈ–అభ్యాస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఒలింపియాడ్ పరీక్షలో స్థానిక శ్రీప్రగతి విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ చూపినట్టు ప్రిన్సిపాల్ పసుపులేటి కిషోర్ తెలిపారు. అభ్యాసోత్సవ్ అవార్డుల పంపిణీలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సరిత, ఇస్రో శాస్త్రవేత్త గోపీక్రిష్ణ చేతులమీదుగా విద్యార్థులు జ్ఞాపికలు అందుకున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయన అభినందించారు.

కండలేరులో 46.819 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 46.819 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,380, పిన్నే రు కాలువకు 5, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

సీనియర్ పాత్రికేయుడికి నివాళి



సాక్షి టీవీ రిపోర్టర్‌తో మాట్లాడుతున్న మేరిగ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పాణకా దంపతులు

గూడూరు రూరల్ : గూడూరుకు చెందిన సీనియర్ పాత్రికేయుడు చిరువెళ్ల క్రిష్ణ మోహన్(70) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ పాణకా దేవసేనమ్మ, పారిశ్రామికవేత్త పాణకా శివకుమార్‌రెడ్డి అక్కడికి చేరుకున్నారు. ఆయన మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నాయుడుపేట టౌన్ : తుమ్మూరు 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 6 గంటల నుంచి 10 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ ఎన్ శివశంకర్ తెలిపారు. నాయుడుపేట పట్టణంతో పాటు తుమ్మూరు తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు వరం ఐఐహెచ్‌టీ



ప్రగడ కోటయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

వెంకటగిరి రూరల్ : వెంకటగిరిలో శ్రీ ప్రగడ కోటయ్య ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ) ఉండడం స్థానికులకు వరమని ఆ సంస్థ ఇన్‌స్టిట్యూట్ పూర్వ విద్యార్థుల సంఘం ప్రెసిడెంట్ నక్కా దుర్గాప్రసాద్ తెలిపారు. ఇన్‌స్టిట్యూట్‌లో ఆదివారం సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శ్రీప్రగడ కోటయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ కోర్సులు చేసి ఎంతోమంది ఉపాధి పొందుతున్నారని తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం ప్రెసిడెంట్‌గా జి.శ్రీనివాసులు, సెక్రటరీగా పీడీ కిషోర్ కుమార్, ట్రెజరర్‌గా హరినాథ్‌బాబు ఎన్నికయ్యారు. ప్రిన్సిపాల్ శేషగిరిరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల పండుగ



గూడూరులో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బేరిపేటలో ఉన్న సౌత్ ఆంధ్ర లూథరన్ చర్చి వద్ద బిషప్ రైట్ రెవరెండ్ ఓ మైఖేల్ బెన్‌హర్ ఆధ్వర్యంలో పిల్లలు మట్టలు చేతపట్టుకుని క్రీస్తు గీతాలను ఆలపిస్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో చర్చి మాజీ చైర్మన్ కేజే జ్ఞానానందం, వైస్ చైర్మన్ కాళహస్తి బాబురావు, సండే స్కూల్ కరస్పాండెంట్ కే ప్రేమ్‌చంద్, కార్యదర్శి కేఎంపీ కళాచంద్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రజక కాలనీలోని బేతేలు చర్చి పాస్టర్లు శరత్‌కుమార్, మనోశరత్ మార్కెట్ సమీపంలో ఉన్న రోమన్ క్యాథలిక్ చర్చిలో మట్టల పండగను ఘనంగా జరుపుకున్నారు.

క్రైస్తవుల ర్యాలీ

చిల్లకూరు : గూడూరు పట్టణంలోని సౌత్ ఆంధ్రా లూథరన్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం ఏసు క్రీస్తు రాకను స్వాగతిస్తూ క్రైస్తవులు మట్టలు చేతపట్టుకుని ర్యాలీ చేశారు. సంఘ కాపరి ప్రవీణ్ రాజ్ మాట్లాడుతూ క్రీస్తు యెరూసలేం వచ్చిన సమయంలో ప్రజలు ఖర్జూరపు మట్టలు కింద పరిచి ఘనంగా స్వాగతించారని తెలిపారు. అనంతరం ఆయన శిలువపై మరణించాడని తెలిపారు. దీనికి గుర్తుగా నేటికి 40 దినాలను శ్రమల కాలంగా పరిగణించి, ప్రతి రోజూ ప్రార్థనలు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘం చైర్మన్ రాజయ్య, పీసీసీ, ఎల్‌సీసీ సభ్యులు, మహిళా సమాజ సభ్యులు పాల్గొన్నారు.

చిల్లకూరు మండలంలో..

మండలంలోని పలు చర్చిల ఆధ్వర్యంలో మట్టల ఆదివారాన్ని ఘనంగా జరుపుకున్నారు. కమ్మవారిపాళెం లోగోస్ లూథరన్ చర్చి, ఏరూరులోని సెయింట్ జాన్స్ లూథరన్ చర్చి, మోమిడిలోని లూథరన్ చర్చి, కలవకొండలోని సెయింట్ జాన్ లూథరన్ చర్చి, తిమ్మనగారిపాళెంలోని లూథరన్ చర్చి సంఘ సభ్యులు గ్రామాల్లో ర్యాలీ చేశారు.



చిల్లకూరు : ఏరూరులో..



నాయుడుపేటలో..

స్తంభాలగిరీశ్వరయ్యస్వామి తిరునాళ్ల ప్రారంభం

- 16 వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- ఏర్పాట్లు చేసిన అధికారులు
- 150 మంది పోలీసులతో బందోస్తు



స్తంభాలగిరీశ్వరయ్యస్వామి ఆలయం

డక్కిలి: పచ్చని కొండల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో వెలుగొండల కింద వెలసిన స్తంభాల గిరీశ్వరయ్య స్వామి భక్తుల కొంగు బంగారమై విరాజిల్లుతున్నాడు. ఇక్కడ ప్రతి ఏటా ఏప్రిల్‌లో తిరునాళ్ల నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆదివారం అంకురార్పణ చేశారు. ఉదయం 6 గంటలకు విఘ్నేశ్వర పూజ, 7 గంటలకు ధ్వజారోహణం, అంకురార్పణ, 9 గంటలకు స్వామి, అమ్మవార్లకు అభిషేకం, హారతి, నైవేద్యం సమర్పణ చేశారు. సాయంత్రం పొందుసేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్న క్రమంలో 150 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేసినట్టు వెంకటగిరి సీఐ ఏవీ రమణ తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నట్టు ఈవో శ్రీనివాసులు తెలిపారు.

ఆలయ చరిత్ర....

వైఎస్సార్ జిల్లా బద్వేలుకు చెందిన గిరిజనుడు బద్వేలయ్య తమ గ్రామంలో కలరా రావడంతో భార్యాపిల్లలను తీసుకుని డక్కిలి మండలం దేవునివెల్లంపల్లికి వలస వచ్చారు. బద్వేలయ్య కుమారుడు పాపయ్య పశువులను తోలుకుని వెలుగొండల్లోని స్తంభాలగిరికి వెళ్లేవాడు. ఒకరోజు నిద్రపోయాడు. కలలో శివపార్వతులు కనిపించి దేవునివెల్లంపల్లిలో ఈశ్వరయ్యస్వామి ఆలయం నిర్మించాలని చెప్పి అదృశ్యమయ్యారు. పాపయ్య నిద్ర నుంచి మేల్కొని చూడగా తన పక్కన మహిమగల రాయి కనిపించింది. దాన్ని తీసుకుని వచ్చి గ్రామస్తుల సహకారంతో పూరి గుడిసెలో ప్రతిష్టించాడు. ఇలా 25 ఏళ్లు పూజలు చేశాడు. ఒక రోజు పాపయ్య గ్రామస్తులను పిలిపి కొద్దిరోజుల్లో తాను చనిపోతానని, ఆ రోజు పది మైళ్ల దూరం వరకు వర్షం పడుతుందని చెప్పాడు. 1816లో పాపయ్య చనిపోయాడు. అదే ఆయన చెప్పినట్టు పది మైళ్ల వరకు వర్షం కురిసింది. దీంతో గ్రామస్తులు ఆలయ ప్రాంగణంలోనే ఆయన సమాధిని ఏర్పాటు చేశారు. నాటి నుంచి స్తంభాలగిరీశ్వరయ్యస్వామి తిరనాళ్లను ఘనంగా నిర్వహిస్తున్నారు.

తిరునాళ్లకు ప్రత్యేక బస్సులు

రాపూరు: దేవునివెల్లంపల్లిలో స్తంభాలగిరీశ్వరయ్య తిరునాళ్లకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రాపూరు డిపో మేనేజర్ అనీల్‌కుమార్ తెలిపారు. స్థంభాలగిరీశ్వరయ్యస్వామి తిరునాళ్ల సోమవారం నుంచి ప్రారంభం అవుతున్నట్టు తెలిపారు. ఈ క్రమంలో సోమవారం నుంచి మంగళవారం వరకు రాపూరు –దేవునివెల్లంపల్లికి 7 ప్రత్యేక బస్సు లు నడుపుతున్నట్లు వివరించారు. అలాగే వెంకటగిరి నుంచి దేవునివెల్లంపల్లికి ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు.